క్లుప్తంగా

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

నాగలాపురం: 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్ అన్నారు, బీరకుప్పం, ఎస్ఎస్పురం, టి.పి.కోట, కడివేడు సచివాలయాల్లో గురువారం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, జెడ్పీటీసీ మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో బూత్ కన్వీనర్లదే పుర్తి బాధ్యత అని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, సర్పంచ్‌లు పళని, కృష్ణమశెట్టి, షాబుద్దీన్, భాస్కర్‌రాజు, నేతలు రవి, ధానవేలు, కులశేఖర్, దేశన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న శ్రీసిటీ సిబ్బంది

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇరుగుళం, మాదనపాళెం జెడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో , పరీక్షలు రాయడం కోసం ఒక్కో విద్యార్థికి రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీబాక్సు వితరణగా అందజేశారు. ఇరుగుళంలో 68 మంది, మాదనపాళెంలో18 మందికి శ్రీసిటీలోని రాక్‌వర్త్ కంపెనీ వితరణ అందజేసింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీసిటీ ఫౌండేషన్‌కు, రాక్‌వర్త్ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

సత్యవేడు: శిరుణంబూదూరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్ తండ్రి మోసెస్ మృతి చెందారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సతీమణి చైతన్యభాను శిరుణంబూదూరు వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. గురువారం చైతన్యభాను ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌ను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ. నిరంజన్ రెడ్డి, మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్‌రెడ్డి, రవిరెడ్డి, గోవిందస్వామి, సోము, రాబిన్, ఆనందన్ ఉన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం కొత్త దళితవాడలో మృతురాలి కుటుంబానికి గురువారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి నగదు అందజేసి చేయూతనిచ్చారు. రాజులపాలెం కొత్త దళితవాడలో మొరవ పాపమ్మ(63) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గున్నేరి కిషోర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాలెం రమేష్, తోకల సుబ్రమణ్యం, వరదయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

విద్యతో మెరుగైన సమాజం

పిచ్చాటూరు: విద్యతో మెరుగైన సమాజాన్ని నిర్మిద్దామని పిచ్చాటూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో 10వ తరగతి విద్యార్థుల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వంద శాతం ఫలితాలు సాధించాలి

సత్యవేడు: ఇష్టంతో చదివితే విజయం మీ సొంతమవుతుందని, లక్ష్య సాధనకు కృషిచేయాలని ఎంఈఓ కె.రవి, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మాదనపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల, పీవీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతి పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎంఈఓ, ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజయీభవ అంటూ దీవించారు. పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించి పాఠశాలలకు పేరు తీసుకురావాలని సూచించారు. హెచ్ఎం మునిమోహన్, హరిబాబు, భాస్కర్, వెంకట్‌కుమార్, ఎన్. మోహన్, రాము, జానకిరామిరెడ్డి, మేరి నళినిదేవి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



రేణిగుంట: హస్యబ్రహ్మ శంకర నారాయణ రచించిన 'గంగమ్మ తల్లి శతకం' పుస్తకాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయన ధూర్జటి కళాప్రాంగణంలో ఆలయ సూపరింటిండెంట్ రాజశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో భరివి రవి, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, స్వర్ణ మూర్తి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలే జగనన్నకు శ్రీరామరక్ష



రేణిగుంటలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మధుసూదన్, దేవస్థానం చైర్మన్, ఈఓ

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ
- రేణిగుంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

రేణిగుంట: అక్క చెల్లెమ్మలే 2024 ఎన్నికల్లో జగనన్నకు శ్రీరామ రక్షగా నిలిచి మరోమారు గెలిపించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గురువారం మండల స్థాయి వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు రూ.7.71కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ సంతోషంగా ఉన్నప్పుడే సమాజం వికసిస్తుందని నమ్మిన జగనన్న అన్ని పథకాలను మహిళల పేరిట అందిస్తున్నారని తెలిపారు. గత పాలకులకు, ఈ నాలుగున్నరేళ్ల జగనన్న పాలనకు తేడాను గమనించి ఓటర్లు విజ్ఞతతో ఓటు వేయాలని చెప్పారు. నియోజవకర్గంలో టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్నికలకు ముందు వచ్చి పగటివేషాలు వేస్తున్నాడని,కరోనా కష్ట సమయంలో ఎక్కడున్నాడని ప్రశ్నించారు. తాను కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని అవసరాలు తీర్చానని గుర్తు చేశారు. రేణిగుంట మండలంలో 14వేల మంది పేదలకు ఇంటిపట్టాలిచ్చామని వాటిలో 4,300మందికి పంపిణీ చేసిన భూమిపై టీడీపీ నాయకులు బలవంతంగా కోర్టు కేసులు వేయించడం వల్ల ఆగిపోయాయని చెప్పారు. రైతులతో తాను మాట్లాడి ఒప్పించానని, రెండు రోజుల్లోనే పాగాలిలో పట్టాలున్న వారందరికీ ఇంటి స్థలాలు చూపుతామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న పేదల కోసం తపిస్తూ, వారి సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పన్నీరు కాల్వ శ్రీధర్‌రెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మన్యం శ్రీనివాసులురెడ్డి, మురళీమోహన్, యోగేశ్వరరెడ్డి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గురువారం రేణిగుంట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. తొలుత పార్టీ శ్రేణులు మంగళవాయిద్యాలు, గజమాలలు, శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. రేణిగుంట నడివీధి గంగమ్మ- పోలీస్‌స్టేషన్ వీధి, అన్నదాన సత్రం, బుగ్గవీధి, మోడల్ అకాడమీ స్కూల్ వీధి, ఎంపీడీవో కార్యాలయం, అన్నాసామి పల్లి మార్గంలోని సీసీరోడ్లను, నాగార్జున స్కూల్ వీధిలో రూ.60లక్షల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. మంచినీళ్ల గుంట పార్క్, వాకింగ్ ట్రాక్‌కు ప్రారంభోత్సవం చేశారు. గణేష్ నగర్ న్యూకాలనీ డ్రైనేజీ కాల్వను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, రసూల్, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, యోగేశ్వరరెడ్డి, మురళీ మోహన్, ఎంపీటీసీ జువ్వల ధనంజయరెడ్డి, జాన్ బాబు, మిథున్ శాలి, ఖదీర్, రమణ పాల్గొన్నారు.

సీఎం జగనన్న అభినవ పూలే

బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్న అభినవ పూలే అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన కూడలిలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసిన జగనన్న అభినవ పూలేగా చరిత్రలో నిలిచి పోతారన్నారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, బీసీ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు పుల్లా శ్రీనివాసయాదవ్, వేలాయుధం, సుబ్రమణ్యం రెడ్డి, నక్కా భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

క్రైస్తవుల స్థలాన్ని కాపాడండి

శ్రీకాళహస్తి: క్రైస్తవులకు కేటాయించిన స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని శ్రీకాళహస్తి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంబ్రోస్, రవి దాని, జీవమణి, మణిబాబు, ఆశీర్వాదం, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలన జగనన్నకే సాధ్యం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే అవినీతిరహిత పాలన సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి సచివాలయం, ఆర్‌బీకే, పాయ్య సచివాలయం, ఆర్‌బీకే, తాగునీటి పైపులైను, మల్లిగుంట అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, గెరటారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు రమా, సక్కుబాయమ్మ, నాగేంద్ర, ఎంపీటీసీ పద్మ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఘనంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ రాజగోపురం వద్ద గురువారం విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో రాయలవారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గాలిగోపురం 2010లో కూలిపోయిందన్నారు. ఆ సమయంలో ప్రజలు ఎంతో బాధపడ్డారన్నారు. అక్కడే ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం మాత్రం చెక్కు చెదరకుండా నిలబడిందన్నారు. నవయుగ కన్‌స్ట్రక్షన్ వారు నూతన రాజగోపురాన్ని నిర్మించే సమయంలో ఈ విగ్రహాన్ని అక్కడి నుంచి దక్షిణ గోపురం వద్దకు మార్చారన్నారు. గాలిగోపురం నిర్మాణం పూర్తయినా విగ్రహాన్ని ఇక్కడికి మార్చేందుకు నాటి టీడీపీ ప్రభుత్వం ఇష్టపడలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గాలిగోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయల నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నేడు తన చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈవో నాగేశ్వరావు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఏపీసీడ్స్ కూడలి వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన జ్ఞానముద్రలో ఉన్న భారీ ఈశ్వరుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సెంటర్‌కు శివ సర్కిల్‌గా నామకరణం చేశారు.

డ్వాక్రా రుణాల గోల్‌మాల్ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

సత్యవేడు: వరదయ్యపాళెం మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల నగదు గోల్ మాల్‌లో కేసులో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం కోఆర్డినేటర్, ఏ-3 నిందితుడిగా ఉన్న పుల్లయ్య(43)ను గురువారం అరెస్టు చేసిన కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సీఐ, ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసు వివరాలను సీఐ వివరించారు. శ్రీనిధి, సీఐఎఫ్(రీసైక్లింగ్ లోన్), పీఓపీ(ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేని రుణం) వంటి పథకాల్లో రూ.2.49 కోట్లు వరకు దుర్వినియోగం జరిగింది. 2022లో వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అప్పటి సీఐ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ఇంద్రజ(వీఓఏ) తులసమ్మ(స్వీపర్) విజయమ్మ(వీఓ), యువరాజు(సంఘమిత్ర) శబూరదమ్మ(గ్రామ సమైఖ్య లీడరు)ను అరెస్టు చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో కోఆర్డినేటర్‌గా ఉన్న పుల్లయ్య దాదాపు రూ.10,63లక్షలు దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈకేసులో ఇంకా ఏపీఎం జ్యోతి, కోఆర్డినేటర్ జీవయ్య, సంఘమిత్ర దేవిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో కొత్త పేర్లు వెలుగులోకి వస్తే వారిపైనా కేసులు నమోదు చేస్తామన్నారు.

నేడు వరదయ్యపాళెంలో ఎన్నికల ప్రచారం

వరదయ్యపాళెం: మండలంలోని కురింజల్లం, ఇందిరానగర్, కాంబాకం, కదూరు, నెల్లటూరు, గూడలవారిపాళెం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు పెద్దఎత్తు న హాజరై ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే తొలిప్రాధాన్యం



లబ్ధిని వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని ఆమందూరు పంచాయతీ పరిధి ఆమందూరు, బాలకృష్ణాపురం, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్య తరగతికి చెందిన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే మహాసంకల్పంతో పనిచేస్తున్నారని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జమళ్ల శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పవన్‌కుమార్ యాదవ్, మునిరామయ్య యాదవ్, లోకనాథరెడ్డి, శ్రీకుమార్, గోవిందమ్మ, గురునాథం, గుణశేఖర్ నాయుడు, గురవారెడ్డి, రాజులపాలెం రమేష్, సయ్యద్ కరీముల్లా, హేమంత్ నాయుడు, జీపీ యాదవ్, సురేఖ, యల్లయ్య, లోకనాథం, మునిరత్నం నాయుడు, గంగాధరం, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో ఔషధ గుణాలు



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అందులో ఔషధ గుణాలున్నాయని సీడీపీఓ దేవకుమారి తెలిపా రు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాలు, పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది అందించే పౌష్టికాహారంపై వివరించారు. గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద వేసవి కాలం కావడంతో కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ వసతులతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన గురువారం తలారివెట్టు గ్రామ సమీపంలోని ఫారెస్టులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 లు కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పనిచేయాలని, కూలీల టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్ల తోటలు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఏపీఓ భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అ న్నారు. తొట్టంబేడు మండలం బోనుపల్లి పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకుని మంచి మార్కులు సాధించి శ్రీకాళహస్తి ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో నిలపాలని ఆకాంక్షించారు. శ్రీకాళహస్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేశారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టెప్స్ సంస్థ పథక సంచాలకులు డాక్టర్ ప్రమీలమ్మ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదరనాయుడు, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

రేణిగుంట: తొట్టంబేడు మండలం బోనుపల్లిలోని ఆర్‌బీకే సమీపంలో తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి ప్రారంభించారు. రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామంలో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుమార్‌నాయుడు ఆమె సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, కోవి చంద్రయ్యనాయుడు, రవీంద్రనాయుడు, శ్రీకాళహస్తి దేవస్థానం సభ్యుడు భాస్కర్, గంగాధరం, ఈశ్వరయ్య, పట్టాభి, గిరి, నాగూర్, హరియాదవ్, తిరుపాల్, వెంకీ, భాస్కర్‌రెడ్డి, భక్తవత్సలం నాయుడు, కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులపై టీడీపీ నేతల దాడి

- జనసేన కార్యాలయం ముందు టీడీపీ శ్రేణుల వీరంగం
- టపాకాయలు పేల్చి పెద్ద ఎత్తున నినాదాలు
- ప్రశ్నించడంతో జనసేన కార్యకర్తలను కొట్టి పరారీ
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



జనసేన కార్యాలయం వద్ద బాధితులతో మాట్లాడుతున్న జనసేన నాయకుడు చంద్రశేఖర్

రేణిగుంట(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి జనసేన కార్యాలయం ముందు గురువారం రాత్రి టీడీపీ శ్రేణులు వీరంగం చేశాయి. టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు శ్రీకాళహస్తి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఆ తర్వాత కొందరు పట్టణంలోని కోర్టు సమీపంలోని గోపాలవనం నాయుడు బిల్డింగ్స్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్దకు మోటార్ సైకిళ్లపై వెళ్లి అక్కడ జై బొజ్జల సుధీర్‌రెడ్డి.. అంటూ గట్టిగా నినాదాలు చేస్తూ బాణ సంచా పేల్చి వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడున్న కొందరు జనసేన కార్యకర్తలు వారిని ప్రశ్నించడంతో వారిపై దాడిచేసి పారిపోయారు. అక్కడున్న కార్యకర్తలంతా జనసేన నాయకురాలు వినుత భర్త చంద్రశేఖర్ ముందు ఆవేదన వెళ్లగక్కారు. టికెట్ రాకుండా నైరాశ్యంతో ఉన్న తమ పార్టీ కార్యాలయం ముందుకు టీడీపీ కార్యకర్తలు గంజాయి తాగేసి వచ్చి రెచ్చగొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బలమేమిటో వారికి రుచి చూపిస్తాని, తమను తేలిగ్గా తీసుకున్న వారిని ఊరికే వదిలేది లేదని వారు తెగేసి చెప్పారు. దీంతో అక్కడ నుంచి శ్రీకాళహస్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

చిద్విలాసం.. శివపార్వతుల నృత్యరూపకం



హాస్విక, నివేదికల శివపార్వతుల నృత్యం



సాంబశివరావు శిష్య బృందం ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర కళ్యాణం నృత్యం

రేణిగుంట : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధూర్జటి కళా ప్రాంగణంలో శివపార్వతుల నృత్యరూపకం చిద్విలాసంగా సాగింది. తిరుపతికి చెందిన హాస్విక, నివేదిక చేసిన శివపార్వతుల నృత్యం అద్వితీయంగా సాగింది. అనంతరం నెల్లూరుకు చెందిన సాంబశివరావు శిష్య బృందం ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర కళ్యాణం నృత్యం ఆద్యంతం ఆహుతులను దివ్యానందానికి గురిచేసింది. కర్నూలుకు చెందిన లాస్య ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన గంగాధరం శిష్యులు చేసిన కూచిపూడి నృత్యం, శ్రీకాళహస్తికి చెందిన కుందనశ్రీ నాట్యం అలరించాయి. కళాకారులను ఆలయాధికారులు ప్రశంసాపత్రాలు, దుశ్శాలువలతో సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయలు విక్రయం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను సంస్థ అధికారి రామాంజనేయులు అమ్మారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీయస్‌పురం, కనమనంబేడు, గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరిపంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను తింటే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మ, రిసోర్సు పర్సన్స్ జయలక్ష్మి, ఆశా, రేవతి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సన్మానాలు అందుకున్న మహిళ టీచర్లు

పిచ్చాటూరు: స్థానిక మండల కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మహిళ టీచర్లను శాలువలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మహిళల ఔన్నత్యాన్ని వివరించారు. మహిళా టీచర్లకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. టీచర్లందరికీ పూల మొక్కలు అందించి గౌరవించారు. తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్‌రాజు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌లో గల రాస్ మహిళా వాణి కార్యాలయంలో గురువారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళాభివృద్ధితోనే సమాజం వికసిస్తుందన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకం

ఏర్పేడు: ఎన్నికల సమయంలో బూత్ కమిటీలే కీలకమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాలకృష్ణాపురంలో గురువారం బూత్ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలు పటిష్టంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య, బూత్ కమిటీల కన్వీనర్ బత్తిశెట్టి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, నాయకులు గోపీ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రాంబత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

సమతుల పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో పోషణ పక్వాడ ర్యాలీ

రేణిగుంట: సమతుల పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.హేమావతి అన్నారు. మండలంలోని వెదుళ్లచెరువు, ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం 'పోషణ పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టిక విలువలు ఎక్కువగా ఉన్న పలురకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.